క్లుప్తంగా

బీజేపీలో పలువురి చేరిక



ఎంపీ రఘునందన్ రావు సమక్షంలో బీజేపీలో చేరిన కాంగ్రెస్ నాయకులు

హత్నూర (సంగారెడ్డి): మండలంలోని నవాబుపేటకి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంపీ రఘునందన్ రావు సమక్షంలో శుక్రవారం బీజేపీలో చేరినట్లు ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నాగప్రభు గౌడ్ తెలిపారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు 20 మంది ఎంపీ సమక్షంలో బీజేపీ కండువాలు వేసుకున్నారు. ఈ మేరకు మెదక్ జిల్లా అధ్యక్షుడు వాళ్దాస్ మల్లేశం గౌడ్ పార్టీలో స్వాగతం పలికినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లేశం, పాండు, శ్రీశైలం, రామ్ చందర్, కొమురయ్య, బీరప్ప, ప్రేమ్ దాస్, నరేష్, కృష్ణ, జనార్దన్ పాల్గొన్నారు.

ఘనంగా సంకష్టహర చతుర్థి



పూజలు చేస్తున్న అర్చకుడు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారులో స్వయంభుగా వెలసిన సిద్ధివినాయక ఆలయంలో శుక్రవారం సంకష్టహర చతుర్థి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఉదయం బ్రాహ్మణులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, ఆలయ పరిసర ప్రాంతాల నుంచే కాకుండా కర్నాటక, మహారాష్ట్రకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ప్రమాదకర గోడల కూల్చివేత



ప్రమాదకరంగా ఉన్న గోడను కూల్చివేయిస్తున్న అధికారులు

నారాయణఖేడ్: పట్టణంలోని నెహ్రూనగర్‌లో రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న గోడలను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ ఆదేశాలతో శానిటరీ అధికారి శ్రీనివాస్ పర్యవేక్షణలో జేసీబీతో కూల్చివేశారు. అయితే ఈ రోడ్డు వెంట మండలం నుంచి కంగ్టి, కల్హేర్, సిర్గాపూర్ మండలాలతోపాటు పొరుగున ఉన్న కామారెడ్డి జిల్లా, కర్ణాటకకు రాకపోకలు సాగుతుంటాయి. ఇటీవల రోడ్డును ఆనుకునే ఉన్న పలు ఇళ్లు శిథిలావస్థకు చేరడంతో సంబంధిత వ్యక్తులు ఇళ్లను ఖాళీ చేశారు. అయితే రోడ్డుకు సమీపంలో గోడలు అలాగే ఉండిపోయాయి. దీంతో ప్రమాదాలకు అవకాశం ఉండటంతో అధికారులు కూల్చివేయిస్తున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న నాయకులు

నారాయణఖేడ్: పేదలకు సీఎంఆర్ఎఫ్ వరం లాంటిదని టీపీసీసీ సభ్యుడు కర్నె శ్రీనివాస్, ఉమ్మడి మెదక్ జిల్లా జెడ్పీ ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు నగేష్ షెట్కార్ అన్నారు. ఎంపీ సురేష్ షెట్కార్ సిఫార్సుతో ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా.. శాంతినగర్ తండాకు చెందిన శోభారాణికి రూ.19,500, పెద్దశంకరంపేటకు చెందిన మహ్మద్ రహీయొద్దీన్‌కు రూ.12 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు శుక్రవారం సంబంధిత చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పెద్దశంకరంపేట మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు భానుగౌడ్, నాయకులు బక్షిరాం పాల్గొన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం



దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

కంది(సంగారెడ్డి): కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేసిందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ నర్సారెడ్డి ఆరోపించారు. శుక్రవారం బీసీల రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ పట్టణంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుపై గవర్నర్ ఆమోదం పొందక ముందే రాష్ట్ర ప్రభుత్వం హడావుడిగా జీఓ తీసుకొచ్చి ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు పోచారం గ్రాములు, నరసింహారెడ్డి, గిరిధర్, కోటి రాములు పాల్గొన్నారు.

నిరుపయోగంగా..!

ఆసక్తి కనబర్చని వైద్య సిబ్బంది

- వెలవెలబోతున్న క్వార్టర్స్
- వర్షాలకు దెబ్బతింటున్న వైనం
- రూ.లక్షల్లో నిధులు వృథా



నిరుపయోగంగా వైద్య సిబ్బంది క్వార్టర్స్

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ప్రాంతీయ ఆస్పత్రి సిబ్బంది క్వార్టర్స్ నిరుపయోగంగా మారింది. ఈ భవనాన్ని జీప్లస్ వన్ విధానంతో నిర్మించగా.. నివాస గృహాల్లో వైద్యులు, సిబ్బంది నివాసం ఉండేందుకు ఆసక్తి కనబర్చడం లేదు. దీంతో రూ.లక్షల్లో నిధులు ఖర్చు చేసి నిర్మించిన వసతి క్వార్టర్స్ వెలవెలబోతున్నాయి. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు వాడకంలో లేక దెబ్బతింటున్నాయి. వివరాల ప్రకారం.. జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి జిల్లాలోనే రెండవ అతిపెద్దది. జాతీయ రహదారిపై వంద పడకల ఆస్పత్రి ఉండడంతో రోగుల తాకిడి అధికంగా ఉంటుంది. ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం అవసరం మేరకు డాక్టర్లు, వైద్యసిబ్బంది పోస్టులు మంజూరు చేసింది. ఇందులో భాగంగానే వైద్యులు, వైద్యసిబ్బంది కోసం ఆస్పత్రి ఆవరణలో సుమారు 20 ఏళ్ల క్రితం క్వార్టర్స్ నిర్మించారు. జీప్లస్ వన్ పద్ధతిలో నిర్మించిన నివాస గృహాల్లో మొదట్లో వైద్యులు, సిబ్బంది నివాసం ఉన్నారు. ఈ సమయంలో వైద్యులు నిరంతరం రోగులకు అందుబాటులో ఉండేవారు. ఆ తర్వాత ఒక్కొక్కరు క్వార్టర్స్‌ను ఖాళీ చేయడంతో ప్రస్తుతం నియోపయోగంగా మారింది. అయితే ఒకటి రెండు గదుల్లో 108, 102 అంబులెన్స్ డ్రైవర్స్ మాత్రమే ఉంటున్నారు. మిగతా గదులను స్టోర్ రూం ఉపయోగించుకుంటున్నారు. అయితే వైద్యులు, వైద్య సిబ్బంది కోసం రూ.లక్షల్లో ఖర్చుచేసి నిర్మించిన క్వార్టర్స్ వాడకంలో లేక దెబ్బతింటున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి వసతి గృహాలు ఉపయోగంలోకి తీసుకొస్తే రోగులకు వైద్యులు అందుబాటులో ఉంటారని ప్రజలు కోరుతున్నారు. లేదంటే క్వార్టర్స్ శిథిలమై కూలిపోయే అవకాశం ఉందని వాపోతున్నారు.

రూ.1.50 కోట్లతో జంక్షన్ల అభివృద్ధి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: పట్టణ పరిధిలోని మండే మార్కెట్ జంక్షన్, గ్రీన్ ఫీల్డ్ జంక్షన్, పటేల్‌గూడ డబుల్ బెడ్రూం జంక్షన్‌లను రూ.1.50 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం రెవెన్యూ, మున్సిపల్, ట్రాఫిక్ పోలీస్, మున్సిపల్ మాజీ ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన కూడళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బీరంగూడ-కిష్టారెడ్డిపేట రహదారి పరిధిలో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే గత ప్రభుత్వ హయాంలో బీరంగూడ-కిష్టారెడ్డిపేట రహదారి విస్తరణ కోసం రూ.68 కోట్లు కేటాయించి.. 100 ఫీట్ల రహదారిగా విస్తరించినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే గ్రీన్ ఫీల్డ్ జంక్షన్‌లో శివాజీ విగ్రహం, పటేల్‌గూడా డబుల్ బెడ్రూం జంక్షన్‌లలో మహాత్మా గాంధీ విగ్రహాలను సొంత నిధులతో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. త్వరలో పనులు సైతం ప్రారంభించనున్నట్లు చెప్పారు. అలాగే సింఫనీ కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ మాజీ ఎంపీపీ దేవా నందం, మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహా గౌడ్, తహసీల్దార్ వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి, ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్, మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం డీఈ వెంకటరమణ, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



హోటల్‌ను తనిఖీ చేస్తున్న కమిషనర్ కిషన్

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం పట్టణ పరిధిలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లలో కమిషనర్ కిషన్ శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ నిషేధంపై వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు. ఈ తనిఖీల్లో భాగంగా ప్లాస్టిక్‌ను వినియోగించే పలువురికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్‌ను అరికట్టేందుకు వ్యాపారస్తులు ప్రజలు సహకరించాలని సూచించారు. లేనియెడల చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పట్టణ పరిధిలోని డంపింగ్ యార్డ్ అధికారులతో కలిసి సందర్శించారు. కార్యక్రమంలో మేనేజర్ మల్లికార్జున స్వామి, ఆర్ఓ నర్సింలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగిస్తే జరిమానా

జోగిపేట(అందోల్): ప్లాస్టిక్ వినియోగింపై ఆందోల్-జోగిపేట పురపాలక సంఘం వ్యాపారస్తులకు శుక్రవారం మున్సిపాలిటీ సిబ్బంది అవగాహన కల్పించారు. వ్యాపారస్తులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించవద్దని సూచించారు. ఒకవేళ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అదే విధంగా వృత్తి, వ్యాపార లైసెన్సును రద్దు చేస్తామని వ్యాపారస్తులకు సూచించారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు జిల్లా కోర్టు జరిమానా విధించింది. స్థానిక ట్రాఫిక్ సీఐ లాలూ నా యక్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ కేంద్రంలో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించగా ఏడుగురు పట్టుబడినట్లు చెప్పారు. ఈ మేరకు వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా ఏడుగురికి రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

జహీరాబాద్: నేటి నుంచి మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ విజయలక్ష్మి తెలిపారు. ఈనెల 11, 12వ తేదీల్లో జిల్లాలోని జహీరాబాద్, కోహీర్, ఝరాసంగం, మునిపల్లి, మొగుడంపల్లి, కంది, సదాశివపేట, కొండాపూర్, తెల్లాపూర్, పటాన్‌చెరు మండలాల్లో నీటి సరఫరా ఉండదన్నారు. ఈ మేరకు సింగూర్ ఆనకట్ట వద్ద బూసరెడ్డిపల్లి 100 ఎంఎల్డీ నీటి శుద్ధి కర్మాగారంలో మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆదివారం రాత్రి 8గంటల వరకు రెండు రోజుల పాటు నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఆయా మండలాల ప్రజలు సహకరించాలని సూచించారు.

రేపు పథసంచాలన్

నారాయణఖేడ్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా సంఘ్ ఖేడ్ నగరశాఖ ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక రామమందిరం నుంచి పథసంచాలన్ ప్రారంభమవుతుందని సంఘం బాధ్యులు తెలిపారు. ఈ మేరకు స్వయం సేవకులు పూర్ణగణవేష్ ధరించి రావాలని సూచించారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని ముంగి గ్రామ శివారులో శుక్రవారం విద్యుదాఘాతంతో ఓ ఎద్దు మృతి చెందింది. ముంగికి చెందిన నిరంజన్ రోజు మాదిరిగా ఉదయం తన రెండు ఎద్దులు, గేదేను మేత మేపేందుకు పొలానికి తీసుకెళ్లాడు. దత్తారెడ్డి పొలం వద్ద మేత మేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఎద్దు మృతి చెందింది. కాగా, విద్యుత్ తీగ తెగి కింద పడిన విషయాన్ని గుర్తించిన నిరంజన్.. మిగతా పశువులకు వెళ్లగొట్టాడు. దీంతో తృటిలో ప్రమాదం తప్పింది.

24 నుంచి ఎస్ఏ-1 పరీక్షలు

న్యాల్‌కల్(జహీరాబాద్): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఈ నెల 24 నుంచి ఎస్ఏ-1 పరీక్షలు నిర్వహించాలని విద్యా శాఖ నిర్ణయించింది. అందుకు సంబంధించిన పరీక్షల షెడ్యూల్ ఆ శాఖ శుక్రవారం విడుదల చేసింది. ఈ మేరకు అక్టోబర్ 24 నుంచి 31వ తేది వరకు ఎస్ఏ-1 పరీక్షలు జరగనున్నాయి. ప్రాథమిక పాఠశాలలకు ఈనెల 27 నుంచి 31 వరకు, ప్రాథమికోన్నత, ఉన్నతా పాఠశాలలకు 24 నుంచి 31 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు విద్యా శాఖ అధికారులు తెలిపారు.

కబ్జాకు గురైన నాలాల పరిశీలన



కబ్జాకు గురైన వాగును పరిశీలిస్తున్న ఏఈ జానకీరాం

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని బాగారెడ్డి పల్లి అండర్ రైల్వే బ్రిడ్జి సమీపంలో కబ్జాకు గురైన వాగును ఇరిగేషన్ శాఖ ఏఈ జానకీరాం శుక్రవారం పరిశీలించారు. అండర్ బ్రిడ్జి పక్క నుంచి వెళ్లే వాగు కబ్జాకు గురై కాల్వ మాదిరిగా తయారై కుదించుపోయిందన్నారు. దీంతో నీరంతా అండర్ బ్రిడ్జి కిందకు చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని జాగో రాష్ట్ర అధ్యక్షుడు రాములు నేత ఇటీవల మున్సిపల్ కమిషనర్ సుభాష్‌రావుకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై స్పందించిన కమిషనర్ కబ్జా గురైన వాగును పరిశీలించాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు సూచించారు. ఈ మేరకు ఏఈ జానికీరాం బాగారెడ్డిపల్లిని సందర్శించారు. కబ్జా చేసిన వాగును పరిశీలించిన ఆయన అండర్ బ్రిడ్జి కిందకు నీరు రాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయనతోపాటు బీజేపీ, సీపీఐ నాయకులు సుధీర్‌బండారీ, నర్సింహులు ఉన్నారు.

అట్టహాసంగా ఎస్‌జీఎఫ్ కరాటే పోటీలు



కరాటే పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులతో మాస్టర్లు, నిర్వాహకులు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని విజ్ఞాన్ మోడల్ పాఠశాలలో 69వ ఉమ్మడి మెదక్ జిల్లా అండర్-17 విభాగంలో ఎస్‌జీఎఫ్ కరాటే పోటీలు నిర్వహించారు. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి 250 మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఈ పోటీలకు రిఫరల్‌గా ఇంటర్నేషనల్ రిఫర్ చందర్‌మోహన్, మాస్టర్ శంకర్‌గౌడ్, నాగేష్ జడ్జిలుగా మహేష్ దత్తాత్రేయచారీ, దినకర్ మల్లేశం, రంజీత్ సిద్దుస్వామి, సమీర్, భాగ్యరాజ్, నిర్వాహకులుగా పీడీ సతీష్‌గౌడ్, అబ్జర్వ్‌లుగా పీడీలు రాజశేఖర్, అమృత్ చందర్, ప్రశాంత్‌గౌడ్‌లు వ్యవహరించారు. ఈ మేరకు రాష్ట్ర స్థాయి పోటీలకు 24 మంది విద్యార్థులు ఎంపికయ్యారు.

జిల్లా స్థాయి వాలీబాల్ జట్టుకు ఎంపిక

జహీరాబాద్ టౌన్: మండలంలోని అల్గోల్ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు ఉమ్మడి మెదక్ జిల్లా వాలీబాల్ జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాములు, కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్ జమీల్ తెలిపారు. 69వ ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో భాగంగా నారాయణఖేడ్‌లో జరిగిన అండర్-17 విభాగంలో గురుకుల విద్యార్థులు మునిరోద్దీన్, అబ్దుల్ రహీంలు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో పాటు పీఈటీ అనిల్‌కుమార్, ప్రశాంత్‌గౌడ్‌లను అభినందించారు.

ఉపాధ్యాయులకు డిజిటల్ శిక్షణ



డిజిటల్ శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

జహీరాబాద్ టౌన్: ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు డిజిటల్ లర్నింగ్‌పై మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించారు. పట్టణంలో నిర్వహించిన ఈ శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ తరగతులకు మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మ్యాథ్స్ టీచర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షకులు ఉపాధ్యాయులకు ఏఐ డిజిటల్ నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో మార్పు తీసుకురావడం, కోడింగ్ విధానాన్ని నేర్చుకునేందుకు టీచర్లకు డిజిటల్ శిక్షణ ఇస్తున్నట్లు ఎంఈఓ మాణయ్య చెప్పారు. ఈ నెల 13 నుంచి ఫిజిక్స్ ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు ఉంటాయని ఎంఈఓ తెలిపారు.

అధికారుల అండతోనే మట్టి రవాణా

తహసీల్దార్‌ను కలిసిన బాధిత రైతులు



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు, నాయకులు

జిన్నారం (పటాన్‌చెరు): భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించే వరకు ఆ భూముల్లో ఎలాంటి మట్టి రవాణా చేయవద్దని బాధిత రైతులు కోరారు. ఈ మేరకు స్థానిక నాయకులతో కలిసి రైతులు తహసీల్దార్ దేవదాసుకు వినతి పత్రం అందజేశారు. సర్వే నెంబర్ 1లోని 420 ఎకరాల్లో అసైన్మెంట్ పట్టాలు కేటాయించిన రైతుల భూముల నుంచి కొంతమంది తప్పుడు పత్రాలు సృష్టించి అక్రమంగా మట్టి రవాణా జరుపుతున్నారన్నారు. అయితే ఈ మట్టి రవాణాపై బాధిత రైతులు హైకోర్టును ఆశ్రయించి స్టే ఆర్డర్ తీసుకొచ్చామన్నారు. కానీ గత 20 రోజులుగా అక్రమంగా ఐదు గ్రామాల పరిశ్రమలకు మట్టి రవాణా జరుపుతుండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమార్కులు మట్టి రవాణా చేస్తున్న అధికారులు స్పందించడం లేదని బాధిత రైతులు వాపోయారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి బాధిత రైతులకు నష్టపరిహారం అందించే వరకు మట్టి రవాణా నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో బాధిత రైతులు, నాయకులు పుట్టి భాస్కర్, నరసింహారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నరేందర్ గౌడ్, భాస్కర్, శంకరయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సారూ.. న్యాయం చేయండి



ఎమ్మెల్యేకు గోడు వినిపించుకుంటున్న బాధితులు

జహీరాబాద్: పట్టణంలోని ఐడీఎస్ఎంటీ కాలనీలోని తమ ఇంటి స్థలాలతో పాటు నిర్మించుకున్న ఇళ్లను కూల్చి వేసిన వారిపై తగిన చర్యలు తీసుకుని తమకు న్యాయం జరిగేలా చూడాలని బాధితులు ఎమ్మెల్యే మాణిక్‌రావును కోరారు. శుక్రవారం బాధితులు క్యాంపు కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం అందజేశారు. రెండు దశాబ్దాల క్రితం పురపాలక సంఘం ఇళ్లు నిర్మిస్తామని ఆహ్వానించిందని, నిర్దేశించిన రుసుం చెల్లించి కొనుగోలు చేసుకున్నట్లు వివరించారు. కాలనీలో ప్రభుత్వ పరంగా రోడ్లను, విద్యుత్ స్తంభాలు సైతం వేశారన్నారు. కానీ కొంతమంది చ్చి తమ భూమి అంటూ ఇబ్బందులకు గురి చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. రోడ్లు సైతం ధ్వంసం చేయగా.. కలెక్టర్‌కు విన్నవించామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నామ రవికిరణ్, యాకూబ్, బండి మోహన్, వెంకటేశంగుప్తా, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

పల్స్ పోలియోపై అవగాహన



మాట్లాడుతున్న వైద్యాధికారి మధుకర్

జిన్నారం (పటాన్‌చెరు): స్థానిక మున్సిపాలిటీల పరిధిలో ప్రభుత్వ ఆదేశాల మేరకు పల్స్ పోలియోను ఈనెల 12వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆరోగ్య కేంద్రాల్లో వైద్య ఆరోగ్య సిబ్బందితో వైద్యాధికారి మధుకర్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పల్స్ పోలియోపై అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లోని ఐదేళ్ల లోపు పిల్లలకు తప్పని సరిగా పోలియో చుక్కలు వేయాలన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య అధికారులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముతక ధాన్యాల్లో పోషకాహారం



అవగాహన కల్పిస్తున్న ఏసీడీపీఓ సుశీల

నారాయణఖేడ్: గర్భిణులు, కిశోర బాలికలకు పోషకాహారం చాలా ముఖ్యమని ఐసీడీఎస్ ప్రాజెక్టు ఏసీడీపీఓ సుశీల అన్నారు. మండలంలోని చాప్టా (కె)లో శుక్రవారం పోషణ మహోత్సవం, బేటీ బచావో- బేటీపడావో కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముతక, చిరు ధాన్యాల్లో పోషకాలు ఉంటాయన్నారు. ఈ ధాన్యాలతో ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చని సూచించారు. అనంతరం బాలల సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల సూపర్‌వైజర్ మంజుల, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఫైనాన్షియల్ స్పెషలిస్ట్ నర్సింహులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు హనుమాన్ మందిరం వార్షికోత్సవం

రాయికోడ్ (అందోల్): మండలంలోని హనుమాన్ మందిర మొదటి వార్షికోత్సవం వేడుకలను శనివారం నిర్వహించనున్నట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాట్లు పూర్తయ్యాయని చెప్పారు. ఈ మేరకు ఉదయం 6 గంటల నుంచి ఆంజనేయ స్వామికి అభిషేకం, హోమం, హారతి వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం ఆలయ సన్నిధిలో అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.ఈ వేడుకకు భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

◆ తుల్జాభవానీ ఆలయ సందర్శన

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని ఖంజమల్‌పూర్ తుల్జాభవానీ మాత ఆలయంలో చోరీ చేసిన దొంగలను కఠినంగా శిక్షించాలని ఛత్రపతి శివాజీ మహరాజ్ పాదయాత్ర కమిటీ సభ్యులు కొండపురం నర్సింహులు, ధ్దగొల్ల నారాయణ, విశ్వనాథ్ యాదవ్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తుల్జభవానీ ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి ఆలయంలో చోరీ జరగడం దురదృష్టకరమన్నారు. అమ్మవారి కిరీటం, హుండీలోని డబ్బులు ఎత్తుకెళ్లారని, దుండగులను పట్టుకుని శిక్షించాలని పోలీసులను కోరారు.

◆ వాటర్ ఫిల్టర్ మిషన్ల పంపిణీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం తెల్లాపూర్ జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలలకు వాటర్ ఫిల్టర్ మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన కుమారుడు లవణ్ రెడ్డి మాట్లాడుతూ సామాజిక కార్యక్రమాలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తూర్పు శ్రీనివాస్, అరుణ్ గౌడ్, గోపాల్‌రెడ్డి, మాధవ రెడ్డి, సురేష్, మురళి, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ రూ.2.50 లక్షల ఎల్‌ఓసీ అందజేత

జహీరాబాద్: న్యాల్‌కల్ మండలంలోని చాల్కికి చెందిన గౌసియాబేగం వైద్య నిమిత్తం మంజూరైన రూ.2.50లక్షల ఎల్‌ఓసీని శుక్రవారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఉజ్వల్‌రెడ్డి అందజేశారు. ఇటీవల బాధితురాలు నిమ్స్ ఆస్పత్రిలో చేరగా.. సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి సహాయంతో సీఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా మంత్రులు ఎల్‌ఓసీ మంజూరు చేయించారు.

◆ నూతన కమిటీకి సన్మానం

సదాశివపేట(సంగారెడ్డి): మండల విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగల సంఘం నూతన అధ్యక్ష కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆయన నివాసంలో శుక్రవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు నిమ్మాయిల మల్లేశం, అసోసియేట్ అధ్యక్షుడు బుచ్చప్ప, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, నిర్మల, కార్యదర్శి తుకుడేదాస్, కోశాధికారి విశ్వనాథం, సంయుక్త కార్యదర్శి భీమ్ రావు, నిర్వహణ కార్యదర్శి మల్లేశం, ప్రచార కార్యదర్శి కాశీనాథ్, జిల్లా కౌన్సిలర్, అంబయ్య, వీరప్ప, విశ్వనాథం పాల్గొన్నారు.

◆ బీసీలకు కాంగ్రెస్ మరోసారి ద్రోహం

నారాయణఖేడ్: కాంగ్రెస్ పార్టీ బీసీలకు మరోసారి ద్రోహం చేసిందని బీజేపీ మండల అధ్యక్షుడు సిందోల్ దశరథ్ విమర్శించారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంలో కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. ఇందుకు హైకోర్టు స్టే విధించడమే నిదర్శనమన్నారు. న్యాయపరమైన చిక్కులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యే పాయలశంకర్ సూచించిన విషయాన్ని గుర్తుచేశారు. కాంగ్రెస్‌కు బీసీలపై చిత్తశుద్ధి ఉంటే మంత్రివర్గంలో, నామినెటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యత ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఆయనతోపాటు నాయకులు జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

◆ పడిపోయిన టమాటా ధరలు



జహీరాబాద్ టౌన్: టమాటా ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. సాధారణ వర్షపాతం కంటే ఎక్కువగా వర్షాలు కురడంతో కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా టమాటకు విపరీతమైన నష్టం వాటిల్లింది. గత కొంతకాలంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వివిధ రకాల తెగుళ్లు సోకుతున్నాయి. దీంతో టమాటా కాయలు రాలుతుండగా పండ్లు కుళ్లిపోతున్నాయి. ప్రస్తుతం జహీరాబాద్ మార్కెట్‌కు లోకల్‌తో పాటు మహారాష్ట్ర, కర్నాటక, కర్నూల్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద మొత్తంలో టమాటా వస్తుంది. ఇందులో భాగంగానే శుక్రవారం జహీరాబాద్ మార్కెట్ 25 కిలోల బుట్ట రూ. 300 అనగా.. కిలో రూ.12 లోపు పలుకుతుంది. అయితే ధరలు లేకపోవడంతో పాటు టమాట కుళ్లిపోతుండడంతో నిరాశకు గురైన రైతులు రోడ్డు పక్కన పారబోస్తున్నారు.

◆ ఆలయాల్లో కృత్తికా నక్షత్ర వేడుకలు

సంగారెడ్డి టౌన్: పట్టణ శివారులోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం కృత్తికా నక్షత్ర వేడుకలు నిర్వహించారు. ఈ మేరకు అర్చకులు అమ్మవారికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు జరిపించారు. ఆలయ కమిటీ చైర్మన్ తోపాజి అనంత కిషన్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరగగా.. మహిళలు సామూహిక కుంకుమార్చన జరిపించి లలిత సహస్ర పారాయణం చదివారు. అనంతరం అమ్మవారి పల్లకీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.